




## ఘనంగా విశ్వబ్రాహ్మణుల ఉగాది

విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగ వేడుకకు ముందు అమావాస్య రోజు తీగదారు పూలతో పందిరి ఏర్పాటు చేసి వారి కులదైవం వీరబ్రహ్మేంద్రస్వామిని ప్రతిష్ఠించుకుని పూజలు చేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నగరంలోని పలువురు విశ్వబ్రాహ్మణులు ఉగాది పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వారి వృత్తి సామగ్రిని మోదుగ పూలుతో అలంకరించి, భక్ష్యాలు, ఉగాది పచ్చడి నివేదన చేశారు.



పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

## నేడు టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. అలాగే శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీమద్రామాయణ సప్తహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ఏకశిల పార్కులో గల సీతారామచంద్ర ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, వరంగల్‌లోని హంటర్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పంచాంగ శ్రవణానికి తగిన ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు.

## కుజగ్రహం రాజుగా..



ఈ సంవత్సరం కుజగ్రహం రాజుగా ఉండడం జరుగుతోంది. క్రోధి అనే పేరుతో వస్తున్న ఈ కాలం క్రోధ స్వభావం కలిగిన కుజ గ్రహానికి రాజాధిపత్యం వచ్చింది. ఉగాది పండుగ తేదీ 9, వారం మంగళవారం కావడం వల్ల కుజగ్రహం సంపూర్ణంగా బలవంతుడై ఉంటాడు. ఈ సంవత్సరం కఠిన నిర్ణయాలు తీసుకోవడం, న్యాయపర విషయాల్లో గట్టి వైఖరి కలిగి ఉండడం సహజంగా ఏర్పడుతుంది. రాజు కుజుడు కావడంతో ప్రజలు, పాలకుల్లో క్రోధ, ఆవేశాలు పెరగడం, భూ సంబంధ వ్యవహారాలు ఉత్పన్నమవుతాయి. రాజకీయాల్లో ఊహించని పరస్పర వ్యతిరేకాలు తారాస్థాయికి చేరుతాయి.

**- శివపురం రామలింగ ఆరాధ్య, విశ్రాంత అర్చకులు, కరీమాబాద్, వరంగల్**

# శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం



బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు




**హన్మకొండ కల్చరల్ :** తెలుగువారి పండుగల్లో యు(ఉ)గాది పండుగ మొట్టమొదటి. పంచాంగం ప్రకారం ప్రతీ ఉగాదికి ఒక్కో పేరు ఉంటుంది.38వది క్రోధి నామ సంవత్సరం. ఇది కోపం కలిగించేది అని చెప్తారు. 'యుగాది'లో యుగం అనగా వయస్సు, ఆది అనగా ప్రారంభమని అర్థం . ఉగాది పండుగ తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా ఆనందానికి, సౌభాగ్యానికి, ఆధ్యాత్మిక చింతనకు, పల్లెలలోని జానపదుల జీవనశైలికి సంకేతంగా నిలుస్తోంది. ఉగాది కాలానికి సంబంధించిన పండుగ. వేప చెట్లు అమృతాన్ని నింపుకున్న పూలతో ప్రకాశిస్తుండగా మామిడి చెట్లు లేలేత పిందెలతో మానవ కల్యాణానికి మంగళగీతాలు పాడుతుండగా మోదుగ చెట్లు నిప్పు కణికలాంటి పూలతో శోభాయమానం చేస్తుండే వసంతకాలంలో రమణీయమైన సొగసులతో అలరారే చైత్రమాసం ప్రారంభమవుతుంది. చైత్ర శుక్ల పాడ్యమి రోజున ప్రతియేటా ఈ పండుగను జరుపుకుంటారు. మంగళవారం ఉగాదిని పురస్కరించుకుని నగరంలోని పలు కూడళ్లలో కొత్తకుండలు, మోదుగు పూలు, కొత్తచింతపండు, మామిడాకులు, కాయలు, వేప పూలు, చామంతి, గులాబీ, బంతి పూలు, గులాలు, పసుపు, కుంకుమ, గుగ్గిలం తదితర పూజా సామగ్రి అమ్మకాలు సాగాయి.

### ఉగాది పచ్చడి ప్రత్యేకత..

ఆయా కాలాల్లో పండించిన వాటిని పండుగల సందర్భంగా దేవుడికి నివేదించిన అనంతరం స్వీకరిస్తాం. చైత్రమాసంలో లభించే చింతపండు, బెల్లం , మామిడి పిందెలు, వేపపూతను కొత్తకుండలో వేసి పచ్చడిగా చేసి భగవత్ నివేదనలుగా సమర్పిస్తారు. తెలంగాణలో ఉగాది పచ్చడిని పానీయంలాగే చేయడం సాంప్రదాయం. దీన్ని షడ్రుచుల సమ్మేళనంగా భావిస్తారు. నిజానికి ఉగాది ప్రారంభంలో మిరపకాయలు లేవు పూర్వం మిర్యాలు వాడేవారు. ఉగాది పచ్చడిలో కొందరు మిర్యాల పొడి వేయడానికి, ఉల్లిగడ్డ ముక్కలు వేయడానికి అదే కారణం. ఉప్పు కూడా కొద్దిగా వేస్తారు. ఉగాది పండుగరోజు దేవుడికి సమర్పించే నివేదనలలో కొత్తబెల్లం, కొత్త శనిగ పప్పు ఉడికించి చేసే భక్ష్యాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఉగాది పచ్చడి ఎన్నో ఔషధ గుణాలతో కలిగి ఉంటుంది. ముఖ్యంగా కచ్చమామిడి కాయ, చింతపండు, బెల్లం శరీరంలోని రుగ్మతలను తట్టుకునే శక్తి ఉందని శాస్త్రీయంగా నిరూపితమైంది. వేప పువ్వును పచ్చడిలో వాడటం ప్రత్యేకత. బెల్లంను నేరుగా తింటే శరీరానికి వేడి చేస్తుంది. పానీయంగా వాడితే ఎండనుంచి రక్షించుకోవచ్చు.

**38వ తెలుగు సంవత్సరం..** 60 తెలుగు సంవత్సరాలలో 38వది క్రోధినామ సంవత్సరం. ఇది కోపానికి సూచిక.. నేడు కొంగొత్త శ్రీక్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది పర్వదినం నిర్వహిస్తారు.



# ఉన్నతవిద్యను బలోపేతం చేయాలి





సింపోజియంలో మాట్లాడుతున్న సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ హరగోపాల్, పాల్గొన్న అధ్యాపకులు

- హయ్యర్ ఎడ్యుకేషన్ నిర్లక్ష్యానికి గురైంది
- వర్సిటీల్లో అధ్యాపకుల కొరత.. నిధులు కేటాయింపు తక్కువ
- ఉన్నతవిద్యలో ప్రతికూల ప్రభావం
- కేయూలో కుర్తా సింపోజియంలో వక్తలు

**కేయూ క్యాంపస్ :** యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను బలోపేతం చేసేందుకు, బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించాలి. రాష్ట్రంలో గత దశాబ్ద కాలం పాటుగా వర్సిటీల్లోని ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని అధ్యాపకుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధనలపైన ప్రతికూల ప్రభావం చూపిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. వర్సిటీల్లోనూ, డిగ్రీ కళాశాలల్లోనూ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రధానంగా విద్యార్థినుల (అమ్మాయిలు) సంఖ్య బాగా పెరిగిందని అందుకనుగుణంగా వారికి కూడా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంపై పాలకవర్గాలు విద్యా విధానాలు రూపొందించడంలోనూ అంతగా పట్టించుకోవటం లేదన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలోను బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తున్నారన్నారు. విద్యారంగాభివృద్ధికి గత ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది స్పష్టం అవుతోందని వారు అభిప్రాయపడ్డారు. కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరిపాలన భవనంలో నిర్వహించిన సెనేట్ హాల్‌లో రాష్ట్రంలో ఉన్నత విద్య పరిస్థితులు, బలోపేతం అంశంపై రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సింపోజియంనకు కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎ.సదానందం అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ ఆచార్య వడ్డె రవీందర్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ టి పాపిరెడ్డి, రిటైర్డ్ ఆచార్యులు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడారు. ఈ సింపోజియంలో వచ్చిన అభిప్రాయాలపరంగా సూచనలు, సలహాలతో డాక్యుమెంట్ల రూపేణ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కుర్తా అధ్యక్షుడు సదానందం తెలిపారు.

### చదివించినప్పుడే ప్రశ్నించే అవకాశం

వ్యక్తిగా తాను సొంతంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో డబ్బులు పెట్టి చదువుకుంటారు. వారు ఉన్నత విద్యను పూర్తి చేశాక తాము డబ్బులు సంపాదించేందుకే మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది. ప్రభుత్వపరంగా విద్యను అందిస్తే సమాజం తనను చదివించింది అనే భావనతో విద్యను పూర్తిచేసిన వ్యక్తుల్లో సేవాభావం ఉంటుంది. అంతేగాకుండా సమాజం కూడా నైతికంగా ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ విద్య పటిష్టానికి సమాజంలోకి వెళ్లి సామాజికంగా చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

**- హరగోపాల్, సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్**

### సింపోజియంతో కనువిప్పు కలగాలి



సమాజంలో విద్యావ్యవస్థ కీలకమైంది. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యం. ఆల్ఇండియా ఎడ్యుకేషన్ సర్వే రిపోర్టు చూస్తే భారత దేశంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 28.4 శాతం ఉంటే తెలంగాణలో 40 శాతం వరకు ఉంది. ఇలాంటి సింపోజియం డిబేట్ల ద్వారా విద్యారంగ అభివృద్ధికి పలు సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలి.

**- ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్**

### సరైన విద్యా విధానం లేదు



దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా నేటికి సరైన విద్యా విధానం లేదు. వివిధ ప్రభుత్వాల హయాంలో ఇప్పటి వరకు కోఠారి కమిషన్‌తో పాటు వివిధ కమిషన్లు వేశారు. నూతన జాతీయ విద్యావిధానం-2020 అని అంటున్నారు. కానీ నేటికి సరైన నిర్దిష్టమైన విద్యావిధానాన్ని రూపకల్పన చేయలేకపోయారు. కేంద్రం బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు తక్కువగానే కేటాయిస్తోంది.


**- తాటికొండ రమేష్ కేయూ, వీసీ**

### గతంలో వర్సిటీలకు నిధులు ఇచ్చాం

తాను యూజీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు దేశంలో యూనివర్సిటీలకు రీసెర్చ్‌పర్పస్‌లో వివిధ ఫెలోషిప్స్ ఇచ్చాం. పరిశోధన పరంగా నిధులిచ్చి ప్రోత్సహించాం. తొలుత ఆయన జూమ్ మీటింగ్‌లో న్యూఢిల్లీ నుంచి కొద్ది సేపు మాట్లాడారు. గత పదేళ్లుగా యూజీసీకి నిధులు తగ్గిపోయాయన్నారు. ప్రభుత్వ ఉన్నత విద్యారంగంలో నాణ్యమైన విద్య తదితర అంశాల గురించి ఆయన వివరించారు.

**- సుఖ్‌దేవ్‌థోరెట్, యూజీసీ మాజీ చైర్మన్**


### నాణ్యమైన విద్య అందించాలి



ఇంజనీరింగ్ విద్యలోనూ నాణ్యమైన విద్యను అందించాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న విద్యార్థుల్లో ప్రతి ఏడాది బయటికి వస్తున్న వారిలో 30 శాతంమందికి ఉద్యోగానికి సంబంధించిన స్కిల్స్ ఉద్యోగ అర్హతలు ఉండటం లేదు. తాను హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్‌కాలేజీలో డిగ్రీ పూర్తిచేశాను. తాను సోమవారం ఆ కళాశాలను సందర్శించి చూశాను. రెగ్యులర్ ఫ్యాకల్టీ కొందరే ఉన్నారు. దీంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

**- డాక్టర్ మోహన్‌రావు, సీసీఎంబీ మాజీ డైరెక్టర్**

### మార్పునకు విద్య ఒక సాధనం



సామాజిక మార్పునకు విద్య ఒక సాధనం. విద్యార్థులు చదువుకోవాలని ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా సదుపాయాలు లేవు. ప్రభుత్వం టీచింగ్ ఫ్యాకల్టీని నియమించాలి. సంపూర్ణంగా అంతర్గతంగా పనిచేసే వాతావరణం కల్పించాల్సి ఉంటుంది. ఉన్నత విద్య రంగాభివృద్ధికి తగినంత నిధులు వర్సిటీలకు కేటాయించాల్సి ఉంటుంది.

**- కోదండరామ్, తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు**

# సైన్స్‌తోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

- సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు

**కేయూ క్యాంపస్ :** నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సైన్స్‌తోనే సాధ్యమైందని సైన్స్‌పై విద్యార్థులు ఎక్కువగా ఆసక్తిని పెంపొందించుకోవాలని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగం అధ్యాపకులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు నిజనిర్ధారణ కోసం సైన్స్‌ను ఆశ్రయిస్తారన్నారు. ముఖ్యంగా డీఎన్‌ఏ పరిశోధనతో వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. రాజకీయ నాయకులు తమ పదవీకాలం ముగియగానే సమాజంలో తెగతెంపులు అవుతాయన్నారు. కానీ శాస్త్రవేత్తకు నిరంతరం పరిశోధనల అనుసంధానం ఉంటుందన్నారు. కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ మాట్లాడుతూ.. అధ్యాపకులు తమకున్న అవకాశాలను అందిపుచ్చుకొనే విధంగా తరగతి గది పరిశోధనకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బోధన, పరిశోధన నిరంతర ప్రక్రియ అన్నారు. కొంతమందికి అవకాశాలు రావడంతో వారి సేవలు సమాజానికి వివిధ రకాలుగా ఉపయోగపడుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి మాట్లాడుతూ.. మానవాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్, అధ్యాపకుడు డాక్టర్ ఆదిరెడ్డి, సైన్స్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు. కాగా డాక్టర్ మోహన్‌రావు ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడంతో ఆయన కళాశాలను సందర్శించి పలు విషయాలను అడిగి తెలుకున్నారు.

# గుట్టపై గుప్తనిధుల తవ్వకాలు?

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- స్థానిక ముఠా సహకారంతోనే తవ్వకాలు
- కనిపించని నరసింహస్వామి విగ్రహం



నందులబోడు గుట్ట

**చిట్యాల :** మండలంలోని వరికోల్‌పల్లి శివారులోని నందులబోడు గుట్టపై గుప్తనిధుల తవ్వకాల విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుప్తనిధుల తవ్వకాల్లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి బంగారు విగ్రహం లభ్యం కాగా గుట్టుచప్పుడు కాకుండా విక్రయించినట్లు తెలిసింది. నెల రోజుల క్రితం నందులబోడు గుట్ట సమీపంలో గ్రామానికి చెందిన కొంతమంది గుప్తనిధుల తవ్వకాలు జరిపినట్లు అందులో నుంచి విగ్రహం లభించినట్లు విశ్వసనీయ సమాచారం.

**ఆంధ్ర నుంచి వచ్చిన పూజారులు..?**

గుప్తనిధుల కోసం గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు ఆంధ్రా నుంచి ఇద్దరు పూజారులను తీసుకొచ్చి జంతుబలి చేసి, ప్రత్యేక పూజలు జరిపించి తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. అందులో రెండు ఫీట్ల పురాతన బంగారు విగ్రహం లభించినట్లు ఆలస్యంగా తెలిసింది. దీనికి ప్రత్యక్షంగా నిమ్మకాయలు, గవ్వలు, జీడి గింజలతో పూజలు నిర్వహించి మేకను బలిచ్చి తల భాగం అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. సంఘటన స్థలాన్ని గమనిస్తే విగ్రహం లభ్యమైనట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. లభ్యమైన బంగారు విగ్రహాన్ని విక్రయించేందుకు ఆంధ్రా నుంచి వచ్చిన ముఠా సభ్యులకు సయోధ్య కుదరలేదు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది ముఠా సభ్యులు అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లి రూ.8 నుంచి రూ.10 కోట్ల వరకు విక్రయించినట్లు తెలుస్తుంది.

**ఎలా లీకైంది సమాచారం..**

నందులబోడు గుట్ట సమీపంలో వ్యవసాయం చేసుకుంటున్న ఒక వ్యక్తికి గత కొద్ది రోజుల నుంచి మెరుపుగా కంటపడి మెరుస్తున్నట్లు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెప్పాడు. దీంతో ఆ వ్యక్తి మరో వ్యక్తికి సమాచారం అందించాడు. ఈ ఇద్దరు కలిసి మొదటి వ్యక్తి కాదని ముగ్గురు కలిసి ఆంధ్రా నుంచి పూజారులను తీసుకొచ్చారు. ఒక రోజు రాత్రివేళలో గ్రామానికి చెందిన ముగ్గురు పంటచేనులో మిరపకాయల కావలికి వెళ్లారు. అదేరోజు అర్ధరాత్రి నందులబోడు ప్రాంతానికి కారు రావడం గమనించి అరుపులు చేస్తారు. దీంతో కారులో వచ్చిన వారు మిగతా ముగ్గురిని మచ్చిక చేసుకుంటారు. లభించిన సొమ్మును సమభాగాలుగా చేసుకుందామని నమ్మించి పూజలు నిర్వహిస్తారు. కానీ పూజలు అనంతరం ఈ విగ్రహాన్ని తీసుకుని వెళ్లిన తరువాత మిర్చి కావలికి వచ్చిన వ్యక్తులకు దూరంగా ఉంటారు. దీంతో విగ్రహాన్ని అమ్మిన వ్యక్తులు తమకు ద్రోహం చేశారని గ్రహించి గ్రామంలో అక్కడడక్కడ సమాచారం లీకు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు పలువురిని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



సంఘటనా స్థలంలో మేక తలభాగం

## బోర్‌వెల్ వేసుకునేందుకు అనుమతించాలి



అధికారికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**మహాముత్తారం:** గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూముల్లో బోర్‌వెల్ వేసుకునేందుకు అనుమతించాలని లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు సోమవారం కలెక్టర్‌తోపాటు, జిల్లా ఉద్యానవనశాఖ, జిల్లా అటవీ శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. తాము ఎప్పటి నుంచో పోడు భూముల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్నామని అదే విధంగా మండలంలోని బోర్లగూడెం గ్రామంలో వంద ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేయడానికి రైతులు ముందుకు వచ్చారని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పోడుపట్టా భూముల్లో గిరివికాస్ ద్వారా బోరువెల్ వేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్‌నాయక్, నాయకులు లావూడ్యా రాజారాం తదితరులు ఉన్నారు.

## ముందస్తు ఉగాది వేడుకలు



ఉగాది వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

**టేకుమట్ల:** మండలంలోని వెలిశాల నవచైతన్య ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ రాం మధు, డైరెక్టర్ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పండగ పర్వదిన విశేషాలను విద్యార్థులకు వివరించారు. పురోహితుల వేషాధారణలో విద్యార్థులు శ్రవణ పంచాంగాన్ని వినిపించారు. ఉగాది పచ్చడిని ఉపాధ్యాయులు, విద్యార్థులు సేవించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ ప్రత్యేకత గల ఉగాది పచ్చడలో ఆరు రకాల రుచుల వలే మానవ జీవితంలో కష్టసుఖాలు సైతం ఉంటాయన్నారు. ఉగాది పర్వదినాన్ని తల్లిదండ్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరీ, సుమలత, ప్రియాంక, నితీష్, నాగమణి, చైతన్య, చిరంజీవి, స్వరూప, విద్యార్థులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

**కాటారం:** ప్రపంచ మేధావి డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14న ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని అంబేడ్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ ఇసునం మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశానికి పేరు రావడానికి కారణం అంబేడ్కర్ అని కొనియాడారు. రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ జయంతిని అధికారులు ఘనంగా నిర్వహించాలని ప్రతి పౌరుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

**కాటారం:** ఎన్నికల కోడ్ ఉల్లంఘించి మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సోమవారం ఆందోళన నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసిన ఘటనలో ఎమ్మార్పీఎస్‌కు సంబంధించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంపై అభ్యంతరం తెలుపుతూ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ సత్యబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంథెన చిరంజీవి, మంథెన శ్రావణ్, కోరండ్ల సాయికుమార్, చిపెల్లి చిన్న, సకినారపు సమ్మన్న, మంథని రాజబాబులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### పశువులను రోడ్లపై వదిలేస్తే చర్యలు

**మహదేవపూర్:** మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై పశువులను వదిలేస్తే చర్యలు తప్పవని ఎస్సై ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యజమానులు పశువులను సాయంత్రం ఇంటివద్ద ఉంచుకోవాలని జాతీయ రహదారిపై వదలడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

### నియామకం

**భూపాలపల్లి రూరల్:** బీజేపీ మంథని అసెంబ్లీ నియోజకవర్గంలోని మండలాల్లో బీజేపీ పార్టీ మండల అధ్యక్షులతో పాటు మండల ఇన్‌చార్జీలను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కాటారం మండల అధ్యక్షుడిగా బండం మల్లారెడ్డి, ఇన్‌చార్జ్‌గా పిల్లలమర్రి సంపత్, మల్హర్ అధ్యక్షుడిగా ముడుతన పల్లి ప్రభాకర్, ఇన్‌చార్జ్‌గా పాగె రంజిత్, మహదేవ్‌పూర్ అధ్యక్షుడిగా ఆకుల శ్రీధర్, ఇన్‌చార్జ్‌గా బొమ్మన భాస్కర్‌రెడ్డి, మహాముత్తారం అధ్యక్షుడిగా మేడిపల్లి పూర్ణచందర్, ఇన్‌చార్జ్‌గా దుర్గం తిరుపతి, పలిమెల అధ్యక్షుడిగా కోయలకరి నిరంజన్, ఇన్‌చార్జ్‌గా సిరిపురం శ్రీమన్నారయణలను నియమించినట్లు తెలిపారు.

### చలివేంద్రాలు ప్రారంభం



**మల్హర్:** మండల ప్రత్యేకాధికారి ఆదేశాల మేరకు మండలంలోని తాడిచర్ల, వల్లెకుంట గ్రామా పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎంపీడీఓ శ్యామ్‌సుందర్ సోమవారం ప్రారంభించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### మద్యం స్వాధీనం



**టేకుమట్ల:** మండలంలోని దుబ్యాలలో మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్సై పింగిళి అమరేందర్‌రెడ్డి తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్యాల గ్రామానికి చెందిన లెంకటపెల్లి రమేష్ అనే వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని అతడి కిరాణంలో విక్రయిస్తుండగా సోదాలు నిర్వహించి రూ.6,270 విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయన వెంట హెడ్ తుల రమేష్, శ్రీనివాస్, హోంగార్డు గంగరాజులు ఉన్నారు.

### సరుకుల పంపిణీ

**వాజేడు:** మండల పరిధిలోని బొల్లారం గ్రామానికి చెందిన శ్యామల శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో కాళ్లు దెబ్బతిని నడువ లేని పరిస్థితిలో ఉన్నాడు. దీంతో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అతడికి ఆర్థిక సాయం అందించారు. సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ 25 కేజీల బియ్యం, నెలకు సరిపడ నిత్యావసర సరుకులు, కొంత నగదును అందించారు.

### వైన్స్‌లో చోరీ

**మహదేవపూర్:** మండల కేంద్రంలోని తెలంగాణ వైన్స్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై ప్రసాద్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి ఒక యువకుడు వైన్స్ తాళలు పగులగొట్టి షాప్‌లో రూ.50 వేలు చోరీ చేసినట్లు యజమాని సమ్మయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

### బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి



**చిట్యాల :** బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది.. పోలీసుల కథనం ప్రకారం..రేగొండ మండలం కొడవటంచ గ్రామానికి చెందిన నాగుల శివ (28) తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడగా గాయపడి మృతి చెందాడు. శివ గణపురం మండలం కర్కపల్లి గ్రామంలో ఓ పని నిమిత్తం వెళ్తున్నాడు.ఈ క్రమంలో ముచినిపర్తి శివారు వెంకటేశ్వరపల్లి వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్సై ఎం డి.షాఖాన్ తెలిపారు. మృతుడి అన్న నాగుల సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న చంద్రశేఖర్‌గౌడ్

**టేకుమట్ల:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం వర్టికల్ ఇన్‌చార్జ్, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లను పంపిస్తూ, లింకులను ఓపెన్ చేయాలని కోరుతారని, బ్యాంక్ ఖాతా వివరాలను తెలుసుకుంటూ ఓటీపీలను పంపిస్తూ బ్యాంక్ ఖాతాల్లోని నగదును అపహరిస్తారని హెచ్చరించారు. కావున గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్‌లకు స్పందించకుండా ఉండాలన్నారు. అలాగే మహిళలు, విద్యార్థినులు సెల్ ఫోన్‌లో వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో గుర్తు తెలియని వ్యక్తులతో పరిచయం పెంచుకోరాదని, ఫొటోలను పంపించరాదన్నారు. ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ వేధింపులకు గురి చేస్తారన్నారు. కావున గుర్తు తెలియని వ్యక్తులతో ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు రంజిత, స్వప్న, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ రమణ ఉన్నారు.

## ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు



రేడియం స్టిక్కర్లు అంటిస్తున్న పోలీసులు

**మహదేవపూర్:** ప్రమాదాల నివారణలో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు వేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యజమానులతో ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ట్రాక్టర్ నంబర్ ప్లేట్స్ కనిపించే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎస్సై చక్రపాణి, కానిస్టేబుళ్లు ట్రాక్టర్ల యాజమానులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

**కాటారం:** కాంగ్రెస్ పార్టీ మాదిగలని మోసం చేసిందని ఆరోపిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఎమ్మార్పీఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథెన చిరంజీవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాదిగలను జనాభా లెక్కలో లేకుండా చేయాలని కుట్ర పన్నుతుందన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ స్థానాలు ఉంటే అందులో ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పూర్తిగా మాలల పార్టీగా మారిందని జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే తన మాల కులస్తులకే ఎంపీ సీట్లు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వని కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు మంథెన శ్రావణ్, కోరండ్ల సాయికుమార్, చిపెల్లి చిన్న, సకినారపు సమ్మన్న, మంథని రాజబాబు పాల్గొన్నారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ



నుజ్జునుజ్జయిన లారీ ముందు భాగం

**కాళేశ్వరం:** మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని ఇప్పల బోరు వద్ద ఆగి ఉన్న ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీకొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి.. సోమవారం తెల్లవారుజామున ఇప్పల బోరు వద్ద ఇసుక లోడింగ్‌తో లారీపార్కింగ్ చేశారు. కాళేశ్వరం మీదుగా ఇసుక క్వారీకి అతివేగంగా, అజాగ్రత్తతో వెళ్తున్న ఖాళీ లారీ పార్కింగ్ చేసి ఉన్న లారీని ఢీ కొట్టింది. దీంతో ఆగి ఉన్న లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఆ సమయంలో లారి డ్రైవర్ లారీ వెనుక భాగంలో నిద్రిస్తున్నట్లు తెలిసింది. దీంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలుపుతున్నారు. ఖాళీ లారీలు వేగంతో వచ్చి ప్రమాదాలు జరుగుతున్న సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైన అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మిత్రులు

**చిట్యాల:** మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గోపగాని సురేందర్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి సురేందర్‌తో కలిసి 2006–07లో పదో తరగతి చదువుకున్న మిత్రులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మిత్రులు బండి రాజు, చిరంజీవి, మహేందర్, గురుకుంట్ల కిరణ్, నేపాలి రాకేష్, బి. అనిల్, డిజె. ప్రభు, కిషోర్, సురేష్, లక్ష్మణ్, జితేందర్, రఘుపతి, షఫి, శ్రీను, రాజ్‌కుమార్, సురేష్, రాము, రాజు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**ఏటూరునాగారం:** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బీకాం విద్యార్థులు సిగ్నేచర్ మెమొరీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జై చిన్న మాట్లాడుతూ.. ఐఐటీ, ఎన్ఐటీ ఇతర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సిగ్నేచర్ మెమొరీ డేను ఈ డిగ్రీ కళాశాలలో మొదటిసారి చేసినట్లు తెలిపారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటువంటి ఉత్సవాలను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులు వారి వారి దుస్తులపై గుర్తు ఉండేలా సిగ్నేచర్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం ఘన్‌సింగ్, రమేష్ కుమార్, ఏవోఎం రుమారాణి, నవీన్, ఫాతిమా, వెంకటయ్య, జ్యోతి, సంగీత, సంపత్ సురేష్, రమేష్, మున్నిలతోపాటు బీకాం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## హేమాచలుడిని దర్శించుకున్న సీసీఎఫ్



హేమాచలుడిని దర్శించుకుంటున్న సీసీఎఫ్ ప్రభాకర్

**మంగపేట:** మండల పరిధిలోని మల్లూరు గుట్టపై గల శ్రీ హేమాచల క్షేత్రంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ప్రభాకర్ సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొట్ట మొదటిసారిగా ఆలయానికి వచ్చిన సీసీఎఫ్ ప్రభాకర్‌కు పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు, శేఖర్‌శర్మ, ఆశ్వర్‌చంద్ రామానుజం మర్యాద పూర్వకంగా ఆలయంలోకి స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలోని స్వయంభు స్వామివారికి సీసీఎఫ్ ప్రభాకర్ కుటుంబ సభ్యులు గోత్ర నామాలతో ప్రత్యేక అర్చన చేసి స్వామివారి చరిత్ర, ఆలయ పురాణాన్ని వివరించారు. అనంతరం లక్ష్మీనర్సింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్ల శేష వస్త్రాలను బహుకరించి వేద ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తాడ్వాయి రేంజ్ అధికారి సత్తయ్య, మంగపేట డిప్యూటీ రేంజ్ అధికారి కోటేశ్వర్ తదితరులు ఉన్నారు.